తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
31-05-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 280 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
JB జయభేరి



# కరోనాకు మించి మహమ్మారి

## ప్రపంచానికి మరో ముప్పు రాబోతోందా.. కరోనాను మించిన వైరస్ విజృంభించబోతోందా.. ప్రజలు సంసిద్ధంగా ఉండాల్సిందేనా అంటే అవుననే అంటున్నారు...

**జయభేరి, న్యూఢిల్లీ, మే 30:**
యూకే మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు పాట్రిక్ వాలెన్స్. బ్రిటిష్ ప్రభుత్వం మరో మహమ్మారిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఇదే సమయంలో దీనిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా లేదని పేర్కొన్నారు. పోవైస్‌లోని హే ఫెస్టివల్‌లో జరిగిన ఒక ప్యానెల్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు.2021లో నిర్వహించిన జీ7 సదస్సులో వాలెన్స్ కీలక విషయాలు వెల్లడించారు. కోవిడ్ కన్నా తీవ్రమైన మహమ్మారి ప్రపంచంపై విరుచుకు పడుతుందని తెలిపారు. వేగవంతమైన రోగ నిర్ధారణ పరీక్షలు, వేగవంతమైన టీకాలు, వేగవంతమైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉండాలి అని సూచించారు.ఇదిలా ఉండగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య గణాంకాల ప్రకారం.. కోవిడ్ -19 మహమ్మారి జనన సమయంలో ఆయుర్దాయం పుట్టినప్పుడు ఆరోగ్యకరమైన ఆయుర్దాయం (HALE) యొక్క స్థిరమైన లాభం ధోరణిని తిప్పికొట్టింది. కోవిడ్ కారణంగా మనిషి ఆయుర్దాయం

...మిగతాది 2 లో



బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భూములపరంగా క్షేత్ర స్థాయిలో ఉన్న హద్దు రాళ్ల పరంగా తీవ్ర వివాదాలు నెలకొని ఉన్నాయి. రికార్డులలో చూపే భూమి కొలతల వద్దకు వచ్చేసరికి తేడాలొస్తున్నాయి. దీనితో కొనుగోలు, అమ్మకం దారుల మధ్య వివాదాలు నెలకొంటున్నాయి.



# మళ్లీ భూముల సర్వే..

**జయభేరి, హైదరాబాద్, మే 30 :**
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భూములపరంగా క్షేత్ర స్థాయిలో ఉన్న హద్దు రాళ్ల పరంగా తీవ్ర వివాదాలు నెలకొని ఉన్నాయి. రికార్డులలో చూపే భూమి కొలతల వద్దకు వచ్చేసరికి తేడాలొస్తున్నాయి. దీనితో కొనుగోలు, అమ్మకం దారుల మధ్య వివాదాలు నెలకొంటున్నాయి. వాస్తవానికి పట్టా, ప్రభుత్వ, దేవాదాయ, అటవీ, వక్ఫ్ బోర్డు, భూదాన్ భూములు ఎన్నెన్ని ఉన్నాయి అనే వివరాలు రికార్డుల్లో నమోదై ఉంటాయి. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం వీటికి సంబంధించిన హద్దులుగానీ, మ్యాపులు గానీ లేవు. దాని ఫలితంగా లక్షల సంఖ్యలో భూవివాదాలు సంవత్సరాల తరబడి పెండింగ్ లోనే ఉండిపోయాయి. ముందు ఈ సమస్యలన్నీ సమగ్రంగా పరిశీలించి కొత్తగా రికార్డులు రూపొందిస్తేనే భూవివాదాలు పరిష్కారం అవుతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.కేంద్ర ప్రభుత్వం భూ సర్వేకు సంబంధించి ఆయా రాష్ట్రాల సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్లతో ఇటీవలే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఒక్కో రాష్ట్రంలో చేపట్టిన పురోగతిని కేంద్రం అడిగి తెలుసుకుంది. తెలంగాణ రాష్ట్రంలోనైతే ఈ కార్యక్రమం ఇంకా పట్టాలెక్కలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సర్వేపై హడావుడి చేసి మధ్యలోనే వదిలేసింది. 2017 ఆగస్టు 18న అప్పటి సీఎం

...మిగతాది 2 లో

# నయిమ్ డైరీపై ఫోకస్



**జయభేరి, హైదరాబాద్, మే 30:**
2016 ఆగస్టు 8.. ఇది నయీం ఎన్‌కౌంటర్ జరిగిన డేట్.. అటు ఇటుగా ఎనిమిదేళ్లు అయ్యింది. ఈ ఎన్‌కౌంటర్ జరిగి జనాలకు నయీం పీడా విరగడైంది.. ఇది నిజం.. బట్ నయీం బాధితులకు న్యాయం జరిగిందా? నయీంకు అండగా ఉన్న పొలిటిషియన్స్‌కు, పోలీసు అధికారులకు తగిన శాస్త్రి జరిగిందా? దీనికి కాన్ఫిడెంట్‌గా యస్ అని ఆన్సర్ చెప్పలేము. ఎందుకంటే ఇంకా వీడని చిక్కు ముడులు అనేకం. తేలని డైరీ లెక్కలు అనంతం.. సో.. ఈ లెక్కలను తేల్చాలని చూస్తోంది ప్రస్తుత రేవంత్ సర్కార్.. బీఆర్ఎస్ పాలనలో అడ్రస్ లేకుండా పోయిన ఈ కేసును మళ్లీ తిరిగి తవ్వాలని డిసైడ్ అయ్యారు. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత ఏం జరిగింది? 602 మొబైల్స్.. 130 డైరీలు.. 1,050ఎకరాల భూమికి సంబంధించిన.. 750 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్.. భారీగా నగదు.. ఇవీ నయీం డెన్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న కొంచెం లిస్ట్.. అసలు నిజంగా పోలీసులు సీజ్ చేసిన

...మిగతాది 2 లో



# మేడిగడ్డ లెక్క తేలుతుందా..?

**జయభేరి, హైదరాబాద్, మే 30:**
మేడిగడ్డ ఓ మేడిపండు.. యస్.. ఇది ఏదో రైమింగ్ కోసం వాడుతున్న పదాలు కాదు. మేడిగడ్డ ఓ డొల్ల అనేది ఎప్పటి నుంచో కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణ. ఇప్పుడివి ఆరోపణలు కాదు.. నగ్న సత్యాలని తేలింది. గతంలో మొరాయించిన గేట్లు ఎత్తేందుకు ప్రయత్నిస్తుంటే వచ్చే శబ్దాలు విని ఇంజనీర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బ్యారేజ్ ఇంకేంత కుంగుతుందో అనే భయం పనులను ముందుకు సాగనివ్వడం లేదు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎక్స్‌పర్ట్ కమిటీ ఒక సూచన చేసింది. వర్షాకాలం రాకముందే మేడిగడ్డలో మొరాయించిన గేట్లన్నీ పైకి ఎత్తాలని చెప్పింది. లేదంటే మొత్తం బ్యారేజీకే అసలుకే మోసమని వార్నింగ్ ఇచ్చింది. అయితే ఇలా గేట్లు ఎత్తాలని ఎందుకు నిర్ణయించారో ఒకసారి గుర్తు చేసుకుందాం.. గతేడాది అక్టోబర్ 21న7వ

...మిగతాది 2 లో



# పోలీసులపై హీరోయిన్ ఫైర్

సినీనటి నివేథ పేతురాజ్ అంటే సినీ ఇండస్ట్రీలో పరిచయం అక్కర్లేదు. అయితే ఆమె తాజాగా పోలీసులతో వాగ్వాదానికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె వెళ్తున్న కారును పోలీసులు ఆపి, తనిఖీ చేయాలి..డిక్కీ ఓపెన్ చేయాలని కోరగా.. ఆమె అందుకు నిరాకరించారు. అది పరువుకు సంబంధించిన మ్యాటర్ అని, మీకు చెప్పినా అర్థం కాదని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పక్కనే ఓ వ్యక్తి ఇదంతా రికార్డ్ చేయగా.. అతనిపై ఫైర్ అయ్యారు.

# మోడీ గెలిస్తే.. రికార్డే



**జయభేరి, న్యూఢిల్లీ, మే 30:**
దేశంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. 543 స్థానాలకు ఏడు విడతల్లో ఎన్నికలు నిర్వహించే కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఇప్పటి వరకు ఆరు విడతల పోలింగ్ పూర్తయింది. జూన్ 1న తుది విడత ఓటింగ్ జరుగనుంది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఓ సర్వే వైరల్ అవుతోంది. ప్రముఖ సర్వే సంస్థ టౌమ్స్‌నౌ చేసిన సర్వే ఫలితాలుగా ప్రచారం చేస్తున్నారు. ఈ సర్వేలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని 370 స్థానాలు సాధిస్తుందని అంచనా. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి కేవలం 140 సీట్లు వస్తాయని సర్వే తెలిపింది. దేశంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో టౌమ్స్‌నౌ సర్వే బీజేపీకి అనుకూలంగా ఉండడం, అదీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని తెలుపడం సంచలనంగా మారింది.వరుసగా బీజేపీ మూడు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన చరిత్ర లేదు. కాంగ్రెస్ పేరిట ఈ రికార్డు ఉంది. ఈసారి బీజేపీ గెలిచి.. నరేంద్రమోదీ ప్రధాని అయితే అది సరికొత్త రికార్డు అవుతుంది. ఇప్పటికే బీజేపీ రెండు పర్యాయాలు సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మరోమారు సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి రావడం మరో రికార్డు. ఇక వరుసగా మూడు పర్యాయాలు ప్రధాని అయిన రికార్డు ఇప్పటి వరకు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉంది. మోదీ మూడోసారి ప్రధాని అయితే.. ఆ రికార్డు సమం అవుతుంది.టైమ్స్‌నౌ సర్వే చూస్తే... ఇండియా కూటమికి మళ్లీ నిరాశే అనిపిస్తుంది. కూటమిలో మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, లాలూప్రసాద్‌యాదవ్, శరద్‌పవార్, ఉద్ధవ్‌ఠాక్రే, స్టాలిన్, పిరయి విజయన్, వంటి ఉద్ధండులు ఉన్నారు. అయినా కూటమి 140 సీట్లు దాటే పరిస్థితి లేదని సర్వే తేల్చడం గమనార్హం. ఇసారి ఎలాగైనా బీజేపీని గద్దె దించాలన్న లక్ష్యంలో ఇండియా కూటమి గట్టిగా ప్రయత్నిస్తోంది. అయినా ఫలితం లేకపోవడం కూటమిని టెన్షన్ పెడుతోంది. ఈమేరకు ఈనెల 1న

...మిగతాది 2 లో



# కలకం రేపుతున్న చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా

2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## కరోనాకు మించి మహమ్మారి

తగ్గిందని తెలిపింది. 2019 నుంచి 2021 మధ్య, ప్రపంచ ఆయుర్దాయం 1.8 సంవత్సరాలు తగ్గిందని తెలిపింది. 2012 నాటికి పడిపోయిందని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్యవంతమైన ఆయుర్దాయం 2021లో 1.5 సంవత్సరాలు తగ్గి 61.9 సంవత్సరాలకు పడిపోయింది (2012 స్థాయికి తిరిగి వచ్చింది). 2024 నివేదిక కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రభావాలు అసమానంగా ఎలా అనుభవించాయో హైలైట్ చేస్తుంది. 2019 మరియు 2021 మధ్య కాలంలో ఆయుర్దాయం సుమారు 3 సంవత్సరాలు, ఆరోగ్యకరమైన ఆయుర్దాయం 2.5 సంవత్సరాలు తగ్గడంతో అమెరికా మరియు ఆగ్నేయాసియా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి విరుద్ధంగా, పాండమిక్ యొక్క మొదటి రెండు సంవత్సరాలలో పశ్చిమ పసిఫిక్ ప్రాంతం కనిష్టంగా ప్రభావితమైంది. ఆయుర్దాయం 0.1 సంవత్సరాల కంటే తక్కువ, ఆరోగ్యకరమైన ఆయుర్దాయం 0.2 సంవత్సరాలలో నష్టపోయింది.

**చైనాల్ మహమ్మారి**

వూహాన్ ల్యాబ్‌లో కోవిడ్-19 వైరస్‌ను సృష్టించి దానిని బయటకు వదిలిన డ్రాగన్ కంట్రీ చైనా మరో వైరస్‌ను పుట్టించింది. హెబీ మెడికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ఎబోలా తరహాలోని మరో కొత్త వైరస్‌ను సృష్టించారు. ఎబోలా మాదిరిగానే ఈ వైరస్ చాలా ప్రమాదకరమైనది. మనిషిని కేవలం మూడు నెలలల్లోనే ఇది చంపేస్తుంది. వ్యాధికారక ప్రభావాలను అధ్యయనం చేసేందుకే శాస్త్రవేత్తలు ఈ వైరస్‌ను సృష్టించారు. అయితే ఇప్పుడు ఈ వైరస్ ప్రయోజనాలు, ప్రమాదాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కోవిడ్ తరహాలో బయటకు వస్తే ప్రపంచానికి మరో ముప్పు దప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. శాస్త్రవేత్తలు కనుగొన్న ఈ వైరస్ స్వభావం సింథటిక్ అని తెలుస్తోంది. ఈ అధ్యయన నివేదిక సైన్స్ డైరెక్ట్‌లో ప్రచురితమైంది. ఎబోలా వైరస్‌ను ఉపయోగించి సృష్టించిన ఈ కొత్త వైరస్‌పై సాగిస్తున్న పరిశోధన వివాదాస్పదంగా మారింది. అయితే ఈ పరిశోధన ఉద్దేశం వివిధ వ్యాధులను నివారించడం. లక్షణాలను పరిశోధించడం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ వైరస్ మనిషి శరీరంపై ఎబోలా లాంటి ప్రభావాన్నే చూపుతుంది. పరిశోధకుల బృందం ఎబోలా వైరస్ నుంచి గ్లైకోప్రొటీన్ (పీజీ)ని స్వీకరించేందుకు వెసిక్యూలర్ స్టోమాటిటిస్ వైరస్ (వీఎస్‌వీ)ని ఉపయోగించిందిఇక ఈ వైరస్‌ను శాస్త్రవేత్తలు సిరియన్ హామ్స్టర్స్ (జంతువుల) సమూహంపై పరీక్షించారు. వీటిలో ఐదు మగ, ఐదు ఆడ జాతులు ఉన్నాయి. ఈ జంతువులకు ఈ వైరస్‌ను ఇంజెక్టు చేయగా, వాటిలో ఎబోలా లాంటి లక్షణాలు కనిపించాఇ. మూడు రోజుల్లోనే అవి మృతిచెందాయి. ఈ వైరస్ ఇంజెక్టచేయగానే కొన్ని జంవుతువుల కళ్లు దెబ్బతిన్నాయి. ఆప్టిక్ నరాలలో తీవ్రమైన ప్రభావం కనిపించింది. 2014-16 మధ్య కాలంలో ఆఫ్రికన్ దేశాలలో ఎబోలా వ్యాప్తి చెందింది. దీనివలన వేలాదిమంది మరణించారు.

## నయిమ్ డైరీపై ఫోకస్

సొమ్మెంత? బంగారమెంత? డెన్‌లో దొరికిన పెన్ డ్రైవ్‌లు ఎన్ని? అందులో ఏముంది? సీజ్ చేసిన వాటిని ఎక్కడ పెట్టారు? ఇలా అనేక ప్రశ్నలు ఇప్పటికీ కూడా మిస్టరీనే.. ఇవన్నీ పక్కన పెడితే అసలు నయీం డైరీలో ఏముంది అన్నది అత్యంత గోప్యంగా ఉంచారు. కొన్ని రోజుల పాటు హడావుడి చేసిన అప్పటి టీఆర్ఎస్ సర్కార్.. మెల్లిమెల్లిగా ఇష్యూను డైవర్ట్ చేసింది. పేరుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాట చేసినా.. విచారణ మాత్రం ఆటకెక్కింది అనేది హండ్రెడ్ పర్సెంట్ ట్రూత్. 197.. నయీంపై ఉన్న కేసుల సంఖ్య ఇది.. 125.. ఇది అరెస్ట్ అయిన నయీం అనుచరుల సంఖ్య. అయితే చార్జ్‌షీట్ దాఖలు చేసింది మాత్రం కేవలం 18 కేసుల్లో మాత్రమే.. మరి మిగిలిని కేసుల సంగతేంటి? ఇదే ఇప్పుడు నయీం బాధితులు వేస్తున్న ప్రశ్న. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదు అని నెత్తి నోరు బాదుకుంటున్నారు. అయితే విచారణ ముందుకు జరగపోవడానికి మెయిన్ రీజన్ నయీం డైరీ అని తెలుస్తోంది. ఎందుకంటే ఈ డైరీలో ఉన్నది పోలీస్ ఉన్నతాధికారులు, కొందరు రాజకీయ నేతల పేర్లు. ఒక్కసారి చర్యలు తీసుకోవడం షురూ అయితే.. శ్రీకృష్ణజన్మస్థానానికి వెళ్లే నేతలు, పోలీసుల సంఖ్య పెద్దగానే ఉన్నట్టు కనిపించింది. అందుకే కొందరు పోలీసులపై తాత్కాలికంగా చర్యలు తీసుకొని.. చాలా మందికి క్లీన్‌చిట్ ఇచ్చేశారు. ఇక రాజకీయ నేతలపై చర్యలు తీసుకున్నారన్న ఊసే వినిపించలేదు.. కనిపించలేదు.. ఆ తర్వాత వార్తల్లో నయీం అన్న పేరే వినిపించడం మానేసింది. కాలం గడిచే కొద్ది.. ఈ కేసు కాలగర్భంలో కలిసిపోతుందని అంతా అనుకున్నారు. బట్.. నయీం వల్ల నాశనమైన జీవితాల సంఖ్య చాలా పెద్దది. అందుకే ఇప్పటికీ కూడా న్యాయం చేయండి మహాప్రభో అంటున్నారు. ఎందుకంటే నయీం, అతని అనుచరులు కబ్జాలు చేసిన భూములు. ఇప్పటికీ అసలు యజమానులకు చేరలేదు. అందుకే మళ్లీ తెరపైకి ఈ గ్యాంగ్‌స్టర్ కేసు వచ్చింది. తెలంగాణ పోలీసులు మళ్లీ ఈ కేసును తవ్వుతున్నారు. నయీం డైరీలో ఉన్న వీఐపీల పేర్లపై ఆరా తీయడం షురూ చేశారు. అసలు ఏ కేసు విచారణ ఏ దశలో ఉందో తెలుసుకుంటున్నారు. సో.. ఈసారి నయీం డైరీ మిస్టరీ ఇకవీడే సమయం కనిపిస్తోంది. అందులో ఉన్న నేతలు, పోలీస్ పెద్దల గుట్టు రట్టు కానుంది..

## మేడిగడ్డ లెక్క తేలుతుందా..?

నంబర్ బ్లాక్ కుంగింది. ఈ బ్లాక్‌లోని రెండు పియర్స్‌కు పగుళ్లు ఏర్పాడ్డాయి.. దీంతో 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను ఎత్తలేకపోయారు. కుంగిన సమయంలో నీటి లీకేజీని ఆపేందుకు ఏకంగా 40 వేల ఇసుక బస్తాలను వేశారు. అయితే ఈ గేట్లను ఎత్తడం అంత ఈజీ కాదు. ఎందుకంటే పునాదులు ఇప్పటికే కుంగాయి. టన్నుల బరువున్న ఈ గేట్లను ఇప్పుడు కదిలిస్తే బ్యారేజీ మరింత కుంగే ప్రమాదం.. సో పునాదులపై ఎలాంటి ప్రెజర్ పడకుండా.. క్రేన్లను ఏర్పాటు చేసి గేట్లను ఎత్తాలన్న దీనికి అనుగుణంగా 15వ నెంబర్‌ను సక్సెస్‌ఫుల్‌గా లిఫ్ట్ చేశారు. బట్ ఎప్పుడైతే 16వ నెంబర్ గేట్‌ను ఎత్తేందుకు ప్రయత్నించారో.. అప్పుడు శబ్ధాలు, ప్రకంపనలు మొదలయ్యాయి. ఏంటా అని చూస్తే.. అసలు కింద మొత్తం అగాథమే ఉందని తేలింది. గుంతలు.. ఇప్పుడు మేడిగడ్డలో ఎక్కడ చూసిన కనిపిస్తున్నవి ఇవే.. వీటిని చూశాక గేట్ల పనుల విషయంలో అడుగు ముందుకు పడటం లేదు. నిజానికి మేడిగడ్డ బ్యారేజీలో గతంలో భారీ ఎత్తున నీటిని నిల్వ చేశారు. ఆ ఒత్తిడితో బ్యారేజీ కింద నుంచి ఇసుక పెద్ద మొత్తంలో కొట్టుకుపోయింది. దీంతో అడుగున పెద్ద అగాథం ఏర్పడిందని NDSA అంచనాకు వచ్చింది. దీని సైజ్ ఏకంగా 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఉండొచ్చనేది ఓ అంచనా.. అయితే ఈ అగాధం ఒకే చోట లేదు.. బ్యారేజీ పొడవులన కొన్ని చోట్ల చిన్నగా.. మరికొన్ని చోట్ల పెద్దగా ఉన్నాయి. ఈ అగాధం కారణంగానే ఏడో బ్లాక్‌లో ప్రస్తుతం పియర్లు కుంగిపోయాయి. ఇప్పుడు రిపేర్లకు కూడా ఈ అగాథలే అడ్డుగా మారాయి. గేట్లను ఎత్తేందుకు ప్రయత్నిస్తే.. ర్యాఫ్ట్‌లు డ్యామేజ్ అవుతున్నాయి. మరిప్పుడు ఏం చేయాలి? పనులు ముందుకు సాగాలంటే ఏం చేయాలి? ప్రస్తుతం ర్యాఫ్ట్ కింద భారీ గుంతలను గ్రౌటింగ్ చేస్తున్నారు. కాంక్రీట్ గ్రౌటింగ్ కోసం రెండు మిషిన్లను తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తి కావాలంటే వారం టైమ్ పడుతుంది. ఈ పనులు సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ అయితేనే గేట్లు ఎత్తే అవకాశం ఉంది. ఏదీ ఏమైనా వర్షాకాలంలోపు మొత్తం గేట్లు ఎత్తాలి. లేదంటే అప్పుడు వచ్చే వరద కారణంగా మొత్తం బ్యారేజీనే దెబ్బతినే అవకాశం ఉంది. మరి గ్రౌటింగ్ పనులు ఫెయిల్ అయితే.. ఈ డౌట్ వచ్చిన ఇంజనీర్స్ ప్లాన్ బీని రెడీ చేశారు. అవసరమైతే మొత్తం గేట్‌నే తొలగించేందుకు రెడీ అవుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైందిఅసలు మేడిగడ్డ బ్యారేజీ కింది భాగంలో బొరియలు ఎగ్జాక్ట్‌గా ఎక్కడున్నాయి..? దీని కోసం ఎక్స్‌పర్ట్ కమిటీ మూడు సంస్థలను సూచించింది. ఆ సంస్థలతో అన్ని పరీక్షలు చేయించనున్నారు. ఆ సంస్థల రిపోర్ట్ ఆధారంగా ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని ఆ ఆగాథాల్లో నింపి.. వాటిని పూడ్చివేయనున్నారు. ఇలా ప్రెషర్ గ్రౌటింగ్ చేసిన తర్వాత గేట్లు ఎత్తే పనులు ప్రారంభం కానున్నాయి. అసలు ప్రాజెక్టులో ఈ అగాథాలు ఎందుకు ఏర్పడ్డాయి? దీనికి ఆన్సర్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే అని తెలుస్తుంది. మేడిగడ్డ ప్రాజెక్ట్ 2019లో పూర్తైంది. ఆ ఇయర్‌లో వచ్చిన వరదలకే బ్యారేజ్ దెబ్బ తిన్నది. కానీ ఈ విషయాన్ని అప్పటి ఇంజనీర్లు గుర్తించి ప్రభుత్వానికి చెప్పినా.. కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదు.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి నుంచి ప్రతి ఇయర్.. కొంచెం కొంచెంగా బ్యారేజ్ డ్యామేజ్ అవుతూ వస్తుంది.. చివరికి కుంగిపోయింది. ఇప్పటికీ ఈ డేంజర్ బెల్స్ మోగుతూనే ఉన్నాయి. వచ్చే వర్షకాలంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఏంటన్నది ఇంజనీర్ల భయం. అసలు మేడిగడ్డ ప్రాజెక్ట్ భవితవ్యం ఏంటి? భవిష్యత్తులో మళ్లీ అది బ్యారేజ్‌గా పనిచేస్తుందా? లేదా? సమాధానాలు రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.. అయితే ఒకటి మాత్రం నిజం.. నెక్ట్స్ సీజన్‌కి కూడా బ్యారేజ్‌తో ఎలాంటి ఉపయోగం లేదుఇవన్నీ వ్యాలీడ్ క్వశ్చన్సే.. గత ప్రభుత్వం మౌనాన్ని వీడలేదు.. సమాధానం చెప్పలేదు. కానీ ఈసారి పోలీసులు కాస్త సీరియస్‌గానే దీనిపై ఫోకస్ చేశారు. విషయాలన్నింటిని తవ్వి తీయాలని ప్రభుత్వం కూడా క్లియర్ కట్‌గా ఆదేశించింది. సో త్వరలోనే చాలా బ్రేకింగ్స్ న్యూస్ చూడబోతున్నారు మీరు.

# బిలినీయర్ల రాజ్యంగా మారుతున్న భారత్

✍ **జయభేరి, హైదరాబాద్ :**

దేశంలో డెమోక్రసీ ఫ్లూటోక్రసీగా మారింది. కోటీశ్వరులుగా.. మహా కోటీశ్వరులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అవినీతి విశృంఖలమై.. నేర చరిత్ర కలవారు మన పాలకులయ్యి దేశం అల్లాడిపోతుంది. ప్రజల ఆదాయాలు జాతీయ ఆదాయంలో వారి వాటా క్రమంగా తగ్గిపోతున్నది.సంపద విషయానికొస్తే 2022, 23 లో ఒక శాతం ధనికుల దగ్గర 40.1 శాతం సంపద ఉన్నది. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం ద్వారా 1990ల నుంచి ఈ ఆదాయ సంపద అసమానతలు గణనీయంగా పెరిగిపోయాయి. 1990 మధ్యకాలంలో ఇద్దరే ఇద్దరు ఉన్న మన బిలినీయర్లో ప్రస్తుతం 200 మందికి చేరారు. ఆనాడు ఆ ఇద్దరు బిలినీయర్ల ఆస్తుల విలువ 3.2 బిలియన్ డాలర్లు మాత్రమే. నేడు ఉన్న 200 బిలినీయర్ల ఆస్తుల విలువ 954 బిలియన్ డాలర్లు. ఈ విధంగా దేశ సంపద కొంతమంది చేతుల్లోకి పోవడం వలన ఆదాయ అసమానతలు పెరిగి మానవాభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో ఒకవైపు కాంగ్రెస్ పార్టీ న్యాయ ప్రత్ అనే మేనిఫెస్టో ద్వారా, మరొకవైపు బీజేపీ సంకల్ప ప్రత్ అనే మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ఏ మేరకు ఉచితాలతో నోరూరిస్తూ అధికారంలోకి ఎలా రావాలి అని తాపత్రయ పడుతున్నారే తప్ప ఆశేష పేద ప్రజానీకానికి సౌకర్యాలను వారి ఆర్థిక అభివృద్ధి తద్వారా సంక్షేమాన్ని ఆలోచిస్తున్నారా? అనే అనుమానం రాకపోదు.దేశ ఆర్థిక అభివృద్ధి తిరోగమనంలో ఉన్నప్పటికీ కార్పొరేట్ వర్గాలకు చెందిన పై స్థాయి బిలియనీర్ల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుంది. వీరి సంపదలోని పెరుగుదల ఏ విధమైన ఉత్పత్తి క్రమం నుంచి వచ్చింది కాదు.




దేశ సహజ వనరులను దేశ సంపదను ప్రభుత్వమే కార్పొరేట్లకు తాయిలాలుగా ఇస్తోంది. దేశంలో బడా కార్పొరేట్ సంస్థ చేతుల్లో దేశంలోని పోర్టులలో 25 శాతం, సిమెంట్ ఉత్పత్తులలో 45 శాతం, స్టీల్ పరిశ్రమంలో 33 శాతం, టెలికాంలో 60 శాతం, బొగ్గు ఎగుమతుల్లో 45 శాతం కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే, దేశం సంపద ప్రైవేట్ గుత్త సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కారాదని ప్రభుత్వం అలా కాకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో 39వ అధికరణలో స్పష్టంగా పొందుపరిచారు. మరి సంపద కేంద్రీకృతం అవుతుండడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? ద్రవ్యలోటు పేరుతో ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరో పక్క బడా బాబులు బ్యాంకులకు బకాయి పడ్డ లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో బ్యాంకులకు బకాయిలు పడిన పెద్దలు 14.56 లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేసి కేవలం 15 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు.

మూడేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు 12కి కుదించారు. 2021, 22 లో ఎఫ్‌డీఐ రూపేనా 4.37 లక్షల కోట్లు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తే.. 2022, 23 సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గి 3.67 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా దెబ్బతిస్తున్నాయో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల పతనం చూస్తే తెలుస్తుంది. ఇన్ని దశాబ్దాల అనుభవం ఉన్న ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడుల కోసం ఎగబడుతూ చేయని పనిలేదు. 1944లో బాంబే ప్లాన్ ప్రకారం.. స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ సహాయంతో పరిశ్రమ నెలకొల్పి పారిశ్రామికీకరణ జరపాలని నిర్ణయించారు. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో సామ్యవాద తరహా సమాజాన్ని స్థాపించాలని.. మన పాలకులు భారత రాజ్యాంగాన్ని రాసుకుని ప్రభుత్వమే అనేక సంస్థలను స్థాపించి సంక్షేమ రాజ్యం బాట పట్టించింది. కానీ నేడు విదేశీ పెట్టుబడులతో స్టాక్ మార్కెట్లో నిధులు కలిసి దేశాన్ని బిలినీయర్ల రాజ్యంగా మారుస్తున్నారు. స్వదేశీ విదేశీ పెట్టుబడి వర్గాల ప్రయోజనాల రక్షణకు భారీగా సబ్సిడీలు కల్పించి ప్రజా బహుళ ప్రయోజనాలు దెబ్బతీస్తున్నారు. 1991లో ఆర్థిక మంత్రి హోదాలో ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ బ్యాంకులో 8 ఏళ్ల పాటు పనిచేసిన అనుభవంతో యూపీఏ ప్రభుత్వ హయాంలో లైసెన్సులపై ఆంక్షలను ఎత్తివేసి గుత్తసంస్థల నిరోధక చట్టాన్ని నామరూపాలు లేకుండా చేశారు. దేశీయ ఆర్థిక వ్యవస్థ తాళాలను, తాళం చెవులతో సహా విదేశీ గుత్త సంస్థలకు వీరి నీడలో ఎదుగదలుచుకున్న స్వదేశీ పారిశ్రామిక గుత్త సంస్థలకు పాలకులు అప్పగించారు.

మేము మీ కన్నా గొప్ప దేశభక్తులమని ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని బిలీనియర్ల రాజ్యంగా మారుస్తున్నది . ప్రస్తుతం దేశంలో 200 మంది బిలియన్లు ఉన్నారు.. అమెరికా చైనా తర్వాత ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్న దేశం మనదే. ప్రభుత్వం ప్రజల నుండి గడిస్తున్న ఆదాయం ఎవరి ప్రయోజనాల కోసం కార్పొరేట్ రంగానికి సబ్సిడీలు ఇచ్చేందుకేనా? ఉచితంగా భూములు కేటాయింపు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు చౌకరేట్లకు సహజ వనరుల అమ్మకాలు ఇవన్నీ ఎవరి కోసం? ఇక ప్రభుత్వాలు ఎందుకు? ప్రభుత్వ స్థానాన్ని ప్రైవేటు కార్పొరేట్ రంగం మెల్లగా అనుభవిస్తున్నది. రాజ్యాంగాన్ని రాసుకున్నది సర్వ సమానత్వాన్ని కోరుకునేది ఇందుకేనా? మార్చి 2024లో వరల్డ్ ఇన్ క్వాలిటీ ల్యాబ్ అనే గ్లోబల్ పరిశోధన సంస్థ భారత్ బిలినీయర్ల రాజ్యం వైపుగా పరుగులు తీస్తున్నదని తెలిపింది.. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్లు రాజ్యంగ భారత్ పరిణామం చెందుతున్నదని తెలిపారు. మన దేశంలో ఉన్నత ఆదాయ వర్గం వారు ఒకే ఒక శాతం ఉన్నప్పటికీ దేశంలోని జాతీయ ఆదాయంలో 22.6% పొందగలుగుతున్నారు. ఇంకా చెప్పాలంటే 0.1 శాతం ధనికులు మన దేశ జాతీయ ఆదాయంలో పది శాతం చేజిక్కించుకుంటున్నారు. ఇది ప్రపంచ దేశాల్లోనే ఎక్కువ.

# కలకలం రేపుతున్న చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా

✍ **జయభేరి, హైదరాబాద్, మే 30:**



తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా యాక్టివిటీస్ ఇతరాష్ట్రాల్లో కూడా ఉన్నట్టు పోలీసుసు అనుమానిస్తున్నారు. ఆ దిశగా రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంకా ఏ ఏ రాష్ట్రాల్లో ఈ ముఠా కార్యకలాపాలు చేపట్టిందో ఆరా తీస్తున్నారు. ప్రస్తుతానికి ఓ బృందం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. చైల్డ్ ట్రాఫిక్ కేసులో ఇప్పటి వరకు అరెస్టు చేసిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఈ కేసులో కిరణ్, ప్రీతిదే కీలక పాత్రగా అనుమానిస్తున్నారు. వాళ్ల కోసం వేట మొదలు పెట్టారు. 50 మందికిపైగా చిన్నారులను విక్రయించినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వీరిలో 16 మందిని గుర్తించారు. ఇంకా మిగతా వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పిల్లల్ని కొనుగోలు చేసిన తల్లిదండ్రులపై కేసులు పెట్టడం ఇక్క మరో ట్విస్టు. దీంతో ఆ ఫ్యామిలీలు బోరున విలపిస్తున్నాయి. తెలిసో తెలియకో పిల్లలు లేరని బెంగతోనో చిన్నారులను కొనుక్కున్నామని వాపోతున్నారు. ఇన్ని రోజులు పెంచుకున్న మమకారంతో వారిని విడిచి పెట్టలేక పోలీస్టేషన్ వద్దే కన్నీరు మున్నీరుగా విలపించారు. తాము ఆ బిడ్డల్ని కనకపోయినా కడుపులో పెట్టుకొని అంతకంటే ఎక్కువగా పెంచుకున్నామని అంటున్నారు. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న చిన్నారులను దూరం చేయొద్దని వేడుకుంటున్నారు. సంతానం లేక ఇబ్బంది పడుతున్న ఫ్యామిలీలు పిల్లల కోసం లక్షలు వెచ్చించారు. ఏదో రూపంలో ఇంట్లోకి పిల్లలు వస్తున్నారన్న ఆనందంతో తప్పులు చేస్తున్నారు. పిల్లల్ని ఇలా దత్తత తీసుకోవాలంటే దానికో నియామవళి ఉంది. అప్పుడే అధికారులు దాన్ని గుర్తిస్తారు. ఇలా ఎవరి వద్ద పడిదే వాళ్ల వద్ద కొంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. ఇలా పిల్లల్ని కొనుగోలు చేస్తున్న వారిలో చాలా మంది ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉన్నవాళ్లు ఉన్నారు. ఇలాంటి వాళ్లు కూడా అప్పులు చేసి డబ్బులు చెల్లించి పిల్లల్ని కొంటున్నారు. ఇలాంటి ముఠాల్లో ఆర్ఎంపీలు, ఆసుపత్రుల్లో పని చేసే సిబ్బంది పాత్ర ఎక్కువగా ఉంటోంది. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన కేసులో కూడా నిందితులుగా ఆరఎంపీలు, ఇతర ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు. శోభారాణి అనే ఆర్ఎంపీ ఈ విక్రయాలు జరుపుతున్నట్టు గుర్తించి చెక్ పెట్టారు.

## మళ్లీ భూముల సర్వే..

కేసీఆర్ 'తెలంగాణలో ప్రతి అంగుళం భూమిని కొలుస్తాం. కొలిచిన భూమికి డిజిటల్ మ్యాప్ ఆఫ్ తెలంగాణను తయారు చేస్తాం' అని చెప్పారు. 2020 సెప్టెంబరు 9న మరోమారు భూముల సర్వే కోసం టెండర్లు పిలవాల్సి ఉందని, సభలో బిల్లులకు ఆమోదం తెలిపిన వెంటనే సర్వే కోసం ముందుకు వెళ్తామని కేసీఆర్ చెప్పారు.

2021 జూన్ 7న మంత్రివర్గ సమావేశంలో సమగ్ర భూ సర్వేపై చర్చించారు. జూన్ 9న డిజిటల్ సర్వే కోసం కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు ప్రకటించారు. డిజిటల్ భూ సర్వే చేపట్టేందుకు 29 ఏజన్సీలు ముందుకొచ్చినా అడుగు కూడా ముందుకు పడలేదు. డిజిటల్ భూ సర్వే ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.83.85 కోట్లు కూడా మంజూరు చేసింది. ఈ నిధుల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.65 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. తర్వాత ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లలో కూడా ఈ కార్యక్రమానికి నిధులు కేటాయించినా నామమాత్రంగానే ఖర్చు చేశారు. తాజాగా ఇదే విషయాన్ని సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్ కేంద్రానికి వివరించారు. దీంతో 202526 మార్చి 31 నాటికి సమగ్ర భూ సర్వే కార్యక్రమం పూర్తి చేయాలని కేంద్రం గడువు విధించింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. ఈ సర్టిఫికెట్ ఇస్తే ప్రతిపాదించిన నిధులు మొత్తం కేంద్రం మంజూరు చేసే అవకాశం కూడా ఉంది. సర్వే చేపడితే ప్రధానంగా ఇద్దరి వ్యక్తుల మధ్యన, దాయాదుల మధ్యన నెలకొన్న భూవివాదాలు పరిష్కారం అవుతాయి. క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణం, రికార్డుల్లో నమోదు చేసిన వివరాలకు సమానంగా ఉంటే భూమికి సంబంధించిన సమస్యలే తలెత్తవు. సర్వే నిర్వహిస్తే రికార్డుల అప్‌డేట్ కూడా జరిగిపోతుంది. ఏళ్ల తరబడి కోర్టుల్లో కొనసాగుతున్న పలు భూ వివాద కేసులు కూడా తగ్గిపోతాయి. అంతే కాకుండా అటవీ, రెవెన్యూ శాఖల సరిహద్దుల్లోని భూముల వివాదాలకు పరిష్కారం దొరుకుంది. రాష్ట్రాల సరిహద్దుల వివాదాలు, గ్రామాలు, జిల్లాల మధ్యన నెలకొన్న సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర భూ సర్వేపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందుకు సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డు కమిషనర్ కార్యాలయం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భూ సర్వే పూర్తి చేసేందుకు ఎన్ని నిధులు కావాలి? ఎంత మంది సిబ్బంది అవసరం? ఎన్ని రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయొచ్చు? సర్వే ద్వారా రైతులకు, ఇతర యజమానులకు కలిగే ప్రయోజనం ఎంత? సర్వే చేపట్టేటప్పుడు క్షేత్రస్థాయిలో నెలకొనే ఇబ్బందులేమిటి? తదితర అంశాలను అంచనా వేస్తూ, సమగ్ర నివేదికను తయారు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్‌తో సమావేశమయ్యారు. భూ సర్వే చేపట్టేందుకు నివేదికలు రూపొందించాలంటూ ఆ విభాగాన్ని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో భూ సర్వే చేపట్టి భూ రికార్డులను అప్‌డేట్ చేసేందుకు డీఐఎల్ఆర్ఎంపీ (డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డు మోడ్రనైజేషన్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆయా రాష్ట్రాలు కోరిన నిధులు కూడా మంజూరు చేస్తోంది. భూ సమగ్ర సర్వే ద్వారానే నిధులు సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు భూ సర్వే కోసం సిబ్బంది, అత్యాధునిక పరికరాలు, రికార్డుల అప్‌డేట్, తదితర అవసరాల కోసం రూ.300 కోట్లు కేటాయిస్తే, సర్వే పూర్తి చేసి రికార్డులు అప్‌డేట్ చేస్తామని చెప్పేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. భూములు సర్వే చేసిన అనంతరం సంబంధిత యజమానికి 14 అంకెలతో కూడిన భూ ఆధార్ నంబరును జారీ చేస్తారు. ఈ నంబరు ద్వారా ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఈ నంబరును ఆన్‌లైన్‌లో కొడితే యజమాని పేరు, భూమి విస్తీర్ణం, భూమి స్వభావం, అక్షాంశాలు, రేఖాంశాల సహితంగా హద్దులు తెలుస్తాయి.

## మోడీ గెలిస్తే.. రికార్డే

ఇండియా కూటమి సమావేశం కానుంది. ఫలితాల తర్వాత తీసుకునే చర్యలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.ఇక బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి గెలిచి నరేంద్రమోదీ ప్రధాని అయితే మాత్రం ప్రపంచంలో భారత్‌కు తిరుగు ఉండదు. ఇప్పటికే ప్రపంచంలోని చాలా దేశాలు భారత ఎన్నికలను నిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే మోదీ విశ్వగురువుగా కీర్తించబడుతున్నారు. మరోమారు ఆయనే ప్రధాని అయితే.. ఇకపై ప్రపంచ దేశాలు శాసించే స్థాయి నుంచి అర్థించేస్థాయికి వస్తాయని నిపుణులు భావిస్తున్నారు. మరి టైమ్స్‌నౌ సర్వే ఫలితాలు ఏమేరకు నిజమవుతాయో తెలియాలంటే జూన్ 1 వరకు వేచి ఉండాలి.

# రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను విజయవంతం చేద్దాం

- తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్
- నీళ్ళు, నిధులు, నియామకం పై జరిగిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం.
- ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి

జయభేరి, మేడిపల్లి :



తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ది కాలం గడుస్తున్న సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని పీర్జాదిగూడ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి తెలిపారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి, అధ్యక్షులు బండారి రవీందర్ సూచనల మేరకు వేడుకల నిర్వహణపై గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షకార్యదర్శులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 సంవత్సరాలు శాంతియుతంగా పోరాటంలో తెలంగాణ ప్రాంతంలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఆనాటి పరిస్థితులకు వ్యతిరేకంగా జరిగినటువంటి ఉద్యమ ప్రస్థానమే తెలంగాణ రాష్ట్రం అన్నారు. నీళ్ళు, నిధులు, నియామకంపై జరిగిన ఉద్యమం తెలంగాణ ఉద్యమం అని, అనేక అపవాదులు, అవమానాలు గురైనా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే తప్ప ఈ ప్రాంతానికి విముక్తి లేదని, అభివృద్ధి సాధించదని కేసీఆర్ పట్టుదలతో తెలంగాణ నినాదాన్ని తీసుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకపోతే కాళేశ్వరం లాంటి బహుళార్థక నిర్మాణం జరిగేది కాదని, తెలంగాణలో 24గంటల కరెంటు వాడినం అంటే తెలంగాణ ఉద్యమ విజయమన్నారు. రైతాంగం మూడు కోట్ల 20లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం పండించామంటే తెలంగాణ ఉద్యమేమన్నారు.



తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ది కాలం గడుస్తున్న సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో ముగింపు వేడుకలు జూన్ 1వ తేదీ నాడు గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్ బండ్ వద్ద గల అమరజ్యోతి వరకు సాయంత్రం 7గంటలకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, రాష్ట్రసాధనలో ప్రాణాలు త్యాగం చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పిస్తారన్నారు.

తెలంగాణ ఆవిర్భావ జూన్ 2న ముగింపు వేడుకల సభను తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు తెలిపారు. అదేరోజు హైదరాబాద్‌లో పలు దవాఖానాలలో అనాథ శరణాలయాలలో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 3న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు నిర్వహించి పార్టీ జెండాను, జాతీయ జెండాను ఆవిష్కరించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తారని వివరించారు. ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడుకలను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, యూత్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు జావీద్ ఖాన్, ఆంజనేయులు, బాలరాజు, వెంకన్న, యాసారం శ్రీనివాస్, కిరణ్, జగన్ రెడ్డి, శంకర్ రావు, నాయకులు జోగి రెడ్డి, మల్లం వెంకటేష్ గౌడ్, చిర్ర సంతోష్ రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి

జయభేరి, కాప్రా :

సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. రామాంతపూర్ డివిజన్, బాలాజీ నగర్ కు చెందిన మల్లేష్ యాదవ్ కు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఒక లక్ష యాభై వేల (రూ.1,50,000/) రూపాయలు మంజూరయ్యాయి. ఈ మొత్తానికి సంబంధించిన ఎల్‌వోసీని ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బాధితునికి అందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు, బొసాని పవన్, చాంద్ పాషా, సురం శంకర్, పాపి రెడ్డి, అనంద్, టోనీ తదితరులు పాల్గోన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన విష్ణు, శివాలయ దేవస్థానం

- ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఉత్సవ కమిటీ పిలుపు

జయభేరి, మే 30:



మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని అక్కన్న మాదన్నల కాలంలో నిర్మించిన అతి పురాతణమైన శ్రీ విష్ణు, శ్రీ శివాలయ దేవస్థానం 38వ వ. వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. I నెల 31 నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటి సభ్యులు తెలిపారు. 31న సుప్రభాత సేవతో గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవనం, ధ్వజారోహణం, మండపారాధాన, నాదస్వర గోష్టి, స్వామి వార్లకు అభిషేకం, అలంకరణం, హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. అదేవిధంగా జూన్ 1వ తేదీన శ్రీ వీరాంజనేయ స్వామి వారికి సింధూర అభిషేకం నిర్వహించి అక్కడ నుంచి ఎదుర్కొలుగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి, శ్రీ భవాణి రామలింగేశ్వర స్వామిని ఆలయం వరకు ఊరేగించనున్నట్లు తెలిపారు. అనంతరం దివ్య కల్యాణోత్సవములు, అన్న ప్రసాద వితరణ, దివ్య రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అదేవిధంగా జూన్ 2న మూలమంత్ర హవనం, సుదర్శన హోమం, రుద్రహవనం, బలి హరణం, మహాపూర్ణాహుతి, మహాదాశీర్వచనం, రుత్విక్ సన్మానం తీర్థప్రసాద వితరణ, అన్నదానం ఉంటుందని తెలిపారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## నల్గొండ జిల్లా అధ్యక్షులుగా కేతావత్ బాబురామ్ నాయక్





జయభేరి, దేవరకొండ :

విద్యార్థుల రాజకీయ పార్టీ దేవరకొండ ఇన్చార్జ్ తో పాటు నల్గొండ జిల్లా అధ్యక్షులుగా మారుమూల ప్రాంతవాసి నేరేడుగొమ్ము మండలము గుర్రపు తండా వాసి కేతవాత్ బాబురామ్ నాయక్ నియమించిన విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు యెచ్చు సునీల్ కి ధన్యవాదములు తెలియజేసిన బాబురామ్ నాయక్, బాబు రామ్ నాయక్ మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో ఉన్న ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ నిరంతరం పోరాటాలు చేస్తానని, విద్యార్థుల సమస్యలపై పోరాడుతానని చెప్పడం జరిగింది నాకు దేవరకొండ ఇన్చార్జ్ తో పాటు నల్గొండ జిల్లా అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర కమిటీకి వ్యవస్థ అధ్యక్షులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినారు.

## రాజేంద్రనగర్ లో డ్రగ్స్ కలకలం

జయభేరి, రంగారెడ్డి:

సన్ సిటీ వద్ద 270 గ్రాముల ఎండిఎంయే డ్రగ్స్ శంషాబాద్ ఎక్సైజ్ బృందం సీజ్ చేసింది. ఓ యువకుడి తో పాటు లేడీ కిలాడీ అరెస్ట్. సన్ సిటీ వద్ద డ్రగ్స్ విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఓ ఈవెంట్ మ్యానేజర్ కు డ్రగ్స్ విక్రయిస్తుండగా పట్టుకున్నారు.



## నేడు జగ్గంగూడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

- వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి

జయభేరి, మే 30:

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలో ఈ నెల 31న విద్యుత్ అంతరాయం ఉంటుందని అలియాబాద్ విద్యుత్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జగ్గంగూడలోని నిక్ మార్క్ కళాశాల, అల్ఫామెడ్ కంపెనీ, హెరిటేజ్, కీర్తి ఫౌల్ట్రీ, సాంజెంటా కంపెనీలకు, వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగాదారులు ఈ అంతరాయాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖకు సహకరించగలరని ఆయన కోరారు.

## చైర్మన్ జెడ్పీటిసి ఎంపీపీ పదవులు దళితులకే..

- ముదిగొండ ఎల్లేష్ MRPS రాష్ట్రప్రధాన కార్యదర్శి



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నియోజకవర్గం లో వివిధ మండలాలలో దేవరకొండ పట్టణంలో ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలలో దళిత ప్రజా ప్రతినిధులు వేదికలపై లేకపోవడం వలన చాలా అవమానం జరిగిందని అని ముదిగొండ ఎల్లేష్ మాదిగ MRPS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారు గతంలో రాజకీయ పదవుల పంపకలలో దళితులపై కుట్ర జరిగింది అని అన్నారు, దేవరకొండ నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా గత ఎన్నికలలో ఒక్క ఎంపీపీ ఒక జడ్పీటిసి కూడా దళితులకు ఇవ్వలేదు అని అన్నారు, నియోజకవర్గంలో జనాభా నిష్పత్తి దమషా ప్రకారంగా దళితులకు రావలసిన రాజకీయ పదవులు ఇచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు దేవరకొండ మార్కెట్ కమిటీ ఏర్పడిన సంవత్సరం నుండి ఇప్పటివరకు ఒక్క దళిత బిడ్డ కుడా మార్కెట్ కమిటీ చైర్మన్ కాలేదు కాబట్టి మార్కెట్ కమిటీ చైర్మన్ దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు త్వరలోనే ఆర్డీవో జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గారికి దళిత సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రలు ఇస్తామని తెలిపారు.

## బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ

- శామీర్ పేట్ మండల కేంద్రంలో స్మశాన వాటికలోని గదిని కబ్జా చేసేందుకు పలువురి యత్నం
- ఆందోళన వ్యక్తం చేసిన స్థానికులు... స్పందించిన గ్రామ కార్యదర్శి మౌనిక

జయభేరి, మే 30:




అప్పనంగా వస్తే స్మశాన వాటికలను సైతం కబ్జా చేయడానికి యత్నిస్తున్నారు కొందరు అక్రమార్కులు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండల కేంద్రంలో ఉన్నటు వంటి స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన స్నానాల గదిని పశువుల పాకగా మార్చారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న కేఎల్ఆర్ కళాశాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో యాదవులు, వడ్డెర, ముదిరాజ్, పద్మశాలి, లంబాడి కులస్థులకు కలిపి అప్పట్లో స్మశాన వాటికను ఏర్పాటు చేసి మహిళలకు, పురుషులకు వేర్వేరుగా స్నానాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేసి గదులను నిర్మించారు. అయితే ఇటీవల ఓ కులానికి చెందిన వారి అంత్యక్రియల ప్రక్రియ ముగిసిన అనంతరం స్నానాలు చేసేందుకు గదికి వెళ్లగా అక్కడ పశువులు తినే గడ్డి కోత మిషన్ ను ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన స్నానాల గదిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా దీనిపై స్పందించిన గ్రామ కార్యదర్శి మౌనిక అక్కడకు చేరుకుని స్నానాల గదిని పరిశీలించారు. గడ్డితో నిండిపోయిన గదిని చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆ గదిని ఖాళీ చేయాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గది బయట హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ లు రామ్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలకు ధీటుగా ఉండాలి

- మహిళా శిశు సంక్షేమం పై సమీక్ష నిర్వహించిన కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్

జయభేరి, చింతపల్లి :



మహిళా శిశు సంక్షేమం పై నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ చింతపల్లి జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. గురువారం నల్లగొండ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఐదవ స్థాయి సంఘం సమావేశంలో నల్లగొండ జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ చింతపల్లి జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి అంగన్వాడీ సెంటర్ లో ప్రీ ప్రైమరీ పాఠశాలలకు ధీటుగా ఉండాలని ఆమె అన్నారు. అంగన్వాడీ భవనాలను ఆధునికరంగా సుందరంగా నిర్మించాలన్నారు. బాల బాలికలకు గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని ఆమె అన్నారు. గ్రామాలలో భ్రూణ హత్యలు జరగకుండా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోని గ్రామాలలో, జిల్లా పరిషత్ పాఠశాలలో బాల్య వివాహాల మీద అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. శిశు గృహాలో ఉన్న శిశువులను ఆరోగ్యంగా ఉండేలా సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నారు. బాల అమృతం సరైన సమయంలో ఇచ్చి వారి ఎదుగుదలకు అధికారులు సహాకరించాలని కోరారు. గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని కోరారు. మహిళల సంక్షేమ కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఇ.ఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, DWO సక్కుబాయి, జడ్పిటిసి ఇరుగు మంగమ్మ, ధనావత్ భారతి నాయక్, బుజ్జి, సి.డి.పి.ఓ లు తదితరులు పాల్గొన్నారు.





# జుట్టు మూలాలకు బలం అవసరం..

జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే మూలాలు బలంగా ఉండాలి. అందుకోసం కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. మీ జుట్టు కుదుళ్లు బలంగా తయారవుతాయి.

జుట్టు సమస్యలను ప్రారంభంలోనే గుర్తించి వాటికి పరిష్కారం కనుగొనేలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే మన జుట్టు పాడైపోతుంది. అన్ని రకాల జుట్టు సమస్యలను పరిష్కరించాలంటే, ముందుగా జుట్టు మూలాలను బలోపేతం చేయడం గురించి ఆలోచించాలి. ఇది అనేక జుట్టు సమస్యలను పరిష్కరించడంతో పాటు, జుట్టు మూలాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఈ విషయాలపై చాలా శ్రద్ధ వహించాలి.

జుట్టు మూలాలను ఎలా బలోపేతం చేయాలో తెలుసుకోవడం ముఖ్యం. అందుకోసం మీరు జుట్టు రాలడాన్ని అరికట్టడానికి, జుట్టు ఆరోగ్యాన్ని పెంచడానికి మార్గాలను పాటించవచ్చు. బలహీనమైన జుట్టు తరచుగా జుట్టు మూలాలను దెబ్బతీస్తుంది. అంతే కాదు చివర్లు చీలిపోవడానికి కూడా దారి తీస్తుంది. ఈ విషయాలన్నీ చాలా సీరియస్‌గా తీసుకోవాలి. కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. జుట్టు బలంగా తయారవుతుంది.

**మంచి ఆహారం :** మొత్తం ఆరోగ్యం జుట్టు ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. జుట్టు మూలాలను బలోపేతం చేయడానికి ఆరోగ్యకరమైన ఆహారం అవసరం. ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని రోజూ తీసుకోవడాన్ని ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే, ఐరన్, జింక్ అధికంగా ఉండే ఆహారాన్ని ఆచరించాలి.

**మసాజ్ :** మసాజ్ జుట్టు ఆరోగ్యానికి సహాయపడుతుంది. ఇది జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతిరోజూ కనీసం నాలుగు నిమిషాల పాటు మీ జుట్టుకు మసాజ్ చేయండి. ఇది మీ జుట్టు మూలాలను బలోపేతం చేయడానికి, రక్త ప్రసరణను పెంచడానికి సహాయపడుతుంది. అంతేకాదు ఈ మసాజ్ జుట్టు పెరుగుదలకు అవసరమైన ఆక్సిజన్ తదితరాలను అందించడంలో కూడా సహాయపడుతుంది.

**కలబంద :** కలబంద ఇది జుట్టు పెరుగుదలకు సహాయపడటమే కాకుండా దానికి అనుకూలమైన వాతావరణాన్ని కూడా సృష్టిస్తుంది. కలబంద జుట్టు సహజత్వాన్ని కాపాడుకోవడంతో పాటు జుట్టుకు ఎదురయ్యే సమస్యలను కూడా పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఇందులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు జుట్టు మూలాల్లోకి లోతుగా చొచ్చుకుపోయి ప్రయోజనాలను పెంచుతాయి.

**ఎగ్ మాస్క్ :** జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో, మెరుపును జోడించడం, మూలాలను బలోపేతం చేయడంలో గుడ్డు చాలా సహాయపడుతుంది. ఇందులోని ప్రొటీన్ జుట్టులోనికి చొచ్చుకుపోయి ఆరోగ్యవంతమైన జుట్టును ఇస్తుంది. వారానికి కనీసం రెండు మూడు సార్లు ఎగ్ మాస్క్‌ని ఉపయోగించడం వల్ల జుట్టులో మంచి మార్పు వస్తుంది. గుడ్లు వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు.

**మందార :** మందార మీ జుట్టును మెరిసేలా చేయడం, జుట్టు పెరుగుదల, జుట్టు మూలాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. మందార ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఇది కండీషనర్‌గా కూడా పనిచేస్తుంది. ఇది మీ జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందనడంలో సందేహం లేదు.

**కొబ్బరి పాలు :** కొబ్బరి పాలు జుట్టు ఆరోగ్యానికి, మూలాలను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతుంది. జుట్టుకు ఇచ్చే మార్పులు చిన్నవి కావు. కొబ్బరి పాలు అవసరమైన కొవ్వులు, ప్రోటీన్లు, పోషకాల గొప్ప పవర్ హౌస్. దీన్ని క్రమం తప్పకుండా ఉపయోగించడం ద్వారా ఇది మీ స్కాల్ప్, హెయిర్ ఫోలికల్స్‌కు పోషణనిస్తుంది. ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.



మొదటిసారి ఐసీసీ ప్రపంచకప్ టోర్నీలో ఆడే అవకాశంతో పాటు ఆతిథ్య హక్కులను పొందిన అమెరికా. దానికి ఆనుకుని ఉన్న కెనడా. పై రెండు దేశాల మాదిరిగానే సరిహద్దులు పంచుకుంటున్న దాయాదులు భారత్, పాకిస్థాన్. తమదైన రోజున సంచలనాలు నమోదుచేసేందుకు సిద్ధమైన ఐర్లాండ్. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్ ఏలో ఐదు జట్లు ఉన్నప్పటికీ అందరి కండ్లు జూన్ 9న జరుగబోయే దాయాదుల పోరు మీదే!



# అందరి కండ్లు దాయాదుల పోరుపైనే..!

తొలిసారి ఐసీసీ ట్రోఫీ బరిలో నిలిచిన అమెరికాపై అంచనాలు లేకపోయినప్పటికీ గ్రూప్ దశలో ఒక్క విజయం నమోదు చేసినా, ప్రత్యర్థులకు కనీసం పోటీనిచ్చినా అది ఆ జట్టుతో పాటు అగ్రరాజ్యాన క్రికెట్‌కూ మంచి చేసేదే. ఇటీవలే 21తో బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నెగ్గడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కోరె అండర్సన్, నిసర్గ పటేల్, స్టీవెన్ టేలర్ వంటి స్టార్లు ఉన్న అమెరికా.. సొంత ప్రేక్షకుల నడుమ ప్రత్యర్థులకు పోటీనివ్వాలని తహతహలాడుతోంది. 2011 వన్డే వరల్డ్ కప్‌లో ఆడిన అనుభవం ఉన్న కెనడాకు ఇదే మొదటి పొట్టి ప్రపంచకప్. ఈ జట్టులోనూ 'వలస క్రికెటర్లు' లెక్కకుమించే ఉన్నారు. అదీగాక అందరూ 'థర్టీ ప్లస్' బాపతే. ప్రత్యర్థి జట్లు తమపై భారీ స్కోరు కొట్టకుండా కాపాడుకోగలిగితే అదే పదివేలు. ఏడోసారి ఈ టోర్నీలో ఆడుతున్న ఐర్లాండ్ గత కొన్నాళ్లుగా బాగా మెరుగయ్యింది. ఫ్రాంచైజీ క్రికెట్ పుణ్యమా అని ఆ జట్టు ఆటగాళ్లు లీగ్‌లలో ఇరగదీస్తున్నారు. అనుభవజ్ఞుడైన పాల్ స్టిర్లింగ్ సారథ్యంలో.. హ్యారీ టెక్టర్, లోర్కన్ టక్కర్, రాస్ అడైర్, కర్టిస్ కంఫర్ వంటి బ్యాటర్లతో ఆ జట్టు బలంగానే ఉంది. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఆడే జోషువా లిటిల్, మార్క్ అడైర్ ఇప్పటికే తామేమిటో నిరూపించుకున్నారు. ఏదైనా సంచలనం నమోదైతే ఐర్లాండ్.. సూపర్ 8కు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

అస్థిరతకు మారుపేరైన పాకిస్థాన్ మరోసారి ఐసీసీ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. 2009లో విజేతగా నిలిచిన పాక్.. వన్డే ప్రపంచకప్ తర్వాత వద్దనుకున్న బాబర్ ఆజమ్ సారథ్యంలోనే మళ్లీ బరిలోకి దిగుతోంది. భారత్‌కు వన్డే వరల్డ్ కప్ అందించిన గ్యారీ కిర్‌స్టెన్‌పై ఆ జట్టు భారీ ఆశలే పెట్టుకుంది. రిజ్వాన్, బాబర్, ఫకర్, ఇఫ్తికార్, ఇమాద్ వసీం వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు ఉన్నా కీలక మ్యాచ్‌లలో వీళ్లు ఏ మేరకు రాణిస్తారనేదే ప్రశ్నార్థకం. పాక్ బ్యాటింగ్ కంటే బౌలింగ్ దళం దుర్భేధ్యంగా ఉంది. షహీన్ అఫ్రిది, నసీమ్ షా, హరీస్ రౌఫ్‌తో పాటు ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు తిరిగొచ్చిన మహ్మద్ అమీర్ ఆ జట్టుకు కీలకం. 2021లో సెమీస్, 2022లో ఫైనల్ చేరిన ఆ జట్టు ఈసారైనా 2009ని పునరావృతం చేయాలని భావిస్తోంది. సెమీస్ చేరడం కష్టమేమీ కాకున్నా భారత్‌తో మ్యాచ్‌లో ఎలా ఆడతారన్నది కీలకం. ఈ గ్రూప్‌తో పాటు టోర్నీలోనూ 'టైటిల్ ఫేవరేట్'గా ఉన్న భారత క్రికెట్ జట్టు.. 11 ఏండ్ల ఐసీసీ ట్రోఫీ కరువును పారదోలేందుకు మరో అవకాశం. 2022 టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ ఓటమి, 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఫైనల్ పరాభవాన్ని మరిచిపోయి ఈ ఏడాది కప్పుకొట్టాలనే లక్ష్యంతో భారత బరిలోకి దిగుతోంది. ఏదైనా 'మహాద్భుతం' జరిగితే తప్ప టీమ్ఇండియా సెమీస్ బెర్తు దాదాపు ఖాయమైనట్టే. అనుభవజులు, యువకులతో కలగలిసిన 'మెన్ ఇన్ బ్లూ'కు గ్రూప్ఏలో అంతో ఇంతో పోటీనిచ్చే జట్టు ఏదైనా ఉందంటే అది బాబర్ సేన మాత్రమే. ఐసీసీ టోర్నీలలో పాక్‌పై భారత్‌కు మంచి రికార్డు ఉండటం మనకు కలిసొచ్చేదే అయినప్పటికీ బంతిని రెండువైపులా స్వింగ్ చేసే అమిర్, అఫ్రిది, నసీమ్ వంటి పేసర్లు ఉండటం మన బ్యాటర్లకు సవాలే. రోహిత్, కోహ్లి, జైస్వాల్, సూర్యకుమార్, పంత్, శివమ్ దూబే వంటి బ్యాటర్లు.. చాహల్, కుల్దీప్ రూపంలో బంతిని గింగిరాలు తిప్పే స్పిన్నర్లు.. జడేజా, హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్లు భారత్ సొంతం. పేసర్లలో బుమ్రాకు తోడుగా అర్‌షదీప్, సిరాజ్ రాణిస్తే రోహిత్ సేనకు ఫైనల్ చేరడం పెద్ద కష్టమేమీ కాదు.



# హీరోయిన్ల బ్యూటీకి ఇదే సీక్రెట్

మంచి నిద్ర మొత్తం ఆరోగ్యానికి మంచిది. అంతేకాదు మీ చర్మం మెరిసేలా చేసేందుకు కూడా ఉపయోగపడుతుంది. చాలా మంది సినిమా నటుల బ్యూటీ సీక్రెట్ కూడా ఇదే.

పనికి వెళ్లే మహిళలు చాలా మంది పని కారణంగా రాత్రికి ఆలస్యంగా ఇంటికి రావడం సహజం. కానీ ఇది మీ చర్మం, జుట్టుకు హాని కలిగిస్తుంది. ఎంత బిజీగా ఉన్నా మరుసటి రోజు ఉదయాన్నే లేవాలి. లేట్ గా పడుకుని ఉదయాన్నే లేస్తే.. మీ చర్మం ఆరోగ్యం దెబ్బతింటుంది.

చర్మం ఆరోగ్యంగా ఉండి.. మీరు అందంగా మెరిసిపోవాలి అంటే కచ్చితంగా ఎనిమిది గంటల నిద్ర అనేది అవసరం. సరైన నిద్ర మీ మొత్తం ఆరోగ్యానికే కాదు.. మీ అందానికి కూడా ఉపయోగపడుతుంది. త్వరగా పడుకుని త్వరగా లేస్తే మీ చర్మం మెరిసిపోతుంది.

ప్రముఖ నటులు, నటీమణుల బ్యూటీ సీక్రెట్స్‌లో ఇదీ ఒకటి.. వారంతా సాధారణంగా రాత్రి 10 గంటలకే పడుకుంటారు. అందాల రంగానికి చెందిన వారు తప్పకుండా ఈ విషయం తెలుసు. ఎందుకంటే అందంగా ఉండేందుకు నిద్ర కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కానీ త్వరగా నిద్రపోవడమే ముఖ్యం కాదు.. మీరు ఎంత సేపు బాగా నిద్రపోతారని కూడా అవసరమే. రాత్రిపూట మీరు ఏం తింటారు? మీరు ఉపయోగించే సౌందర్య సాధనాలు కూడా నిద్రను నిర్ణయిస్తాయి.


మనం నిద్రపోతున్నప్పుడు, శరీరం ఆర్ద్రీకరణ సమతుల్యతతో మన చర్మం తేమను తిరిగి పొందుతుంది. అయితే అదనపు నీరు సాధారణంగా తొలగింపు కోసం ప్రాసెస్ చేయబడుతుంది. అందువల్ల తగినంత విశ్రాంతి లేకపోవడం వల్ల కళ్ళు ఉబ్బుతాయి. ఎక్కువ రోజులు ఇదే కంటిన్యూ అయితే ముఖంపై ముడతలు కూడా వస్తాయి.

తగినంత విశ్రాంతి తీసుకుంటే కళ్ల కింద నల్లటి వలయాలను తగ్గించుకోవచ్చు. మనకు నిద్ర లేమితో రక్త ప్రసరణ సరిగా జరగదు. ఇది కంటి చుట్టూ చేరుతుంది. కొందరు వ్యక్తులు కంటి ప్రాంతం చుట్టూ నల్లని వలయాలు ఉండేందుకు నిద్రలేకపోవడమే ప్రధాన కారణం. నిద్రలేమి నల్లటి వలయాలను అభివృద్ధి చేయవచ్చు.

ముడతలు వంటి వృద్ధాప్య సంకేతాలతో పోరాడటానికి నిద్ర ఒక సహజ మార్గం. మనం నిద్రపోతున్నప్పుడు మన చర్మం కొత్త కొల్లాజెన్‌ని ఉత్పత్తి చేస్తుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల మన చర్మం నిర్జలీకరణంగా కనిపిస్తుంది. ఇది సహజంగానే గీతలు ఎక్కువగా కనిపించేలా చేస్తుంది. ప్రత్యేకించి కంటి కింద చర్మం పాడవుతుంది.

మనం నిద్రపోతున్నప్పుడు చర్మానికి రక్త ప్రసరణ పెరుగుతుంది. మన ఛాయ డల్, డ్రైగా ఉండకూడదు. ఆరోగ్యకరమైన మెరుపును కలిగి ఉండాలి. కాబట్టి మంచి నిద్ర ముఖ్యం.

తగినంత నిద్ర లేకపోవడం శరీరంపై ప్రభావం చూపుతుంది. కార్టిసాల్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది మీ కణజాలంలో కొల్లాజెన్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. చర్మాన్ని దృఢంగా, మృదువుగా ఉంచడానికి కొల్లాజెన్ చాలా అవసరం. నిద్ర లేకుంటే.. చర్మం పొడిబారుతుంది. కళ్ల చుట్టూ చర్మం డల్‌గా కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. నిద్రలేమితో బాధపడే స్త్రీలు కూడా తమ చర్మంలోని నీటిని ఎక్కువగా కోల్పోతారు. టాక్సిక్ కెమికల్స్ కూడా పేరుకుపోతాయి. ఇది చర్మం బాహ్య, అంతర్గతంగా రెండింటినీ ప్రభావితం చేస్తుంది.






# కార్తికేయ సూపర్ స్టార్.. శర్వానంద్

'కార్తికేయ ఆల్‌రౌండ్. యాక్షన్, ఎమోషన్, కామెడీ అన్ని జానర్స్ చేయగల నటుడు. తను తప్పకుండా సూపర్‌స్టార్ అవుతాడు' అని హీరో శర్వానంద్ నమ్మకం వెలిబుచ్చారు. కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'భజేవాయువేగం'. ఐశ్వర్య మీనన్ కథానాయిక. ప్రశాంత్‌రెడ్డి దర్శకుడు. ప్రతిష్టాత్మక యూవీ క్రియేషన్స్ సమర్పణలో, యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం సెన్సార్ యు/ఏ సర్టిఫికెట్ పొందినది. నేడు (శుక్రవారం) సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసిన శర్వా ఇంకా మాట్లాడుతూ ' ఈ టీమ్‌లో చాలామందితో పనిచేశాను. దర్శకుడు ప్రశాంతే ఈ సినిమాకు నిజమైన హీరో. తనెప్పుడు మాస్ మాస్ అని కలవరిస్తాడు. ఆ తరహా కథలే రాస్తాడు. తను 'రన్ రాజా రన్' డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశాడు. అప్పుడే అనుకున్నా ఇతను పెద్ద డైరెక్టర్ అవుతాడని. కచ్చితంగా అందరూ మెచ్చే సినిమాగా ఈ 'భజే వాయువేగం' నిలుస్తుంది అని శర్వానంద్ నమ్మకంగా చెప్పారు. ' ఎలాంటి కథకోసం ఇన్నాళ్లూ ఎదురు చూశానో, అలాంటి కథే 'భజేవాయువేగం'. ముందు దర్శకుడు ప్రశాంత్‌రెడ్డి కి థ్యాంక్స్. 'ఆర్ఎక్స్ 100' తర్వాత ఆ స్థాయి విజయం రాలేదు. ఆ లోటు ఈ సినిమా తీర్చేస్తుంది' అని కార్తికేయ అన్నారు. అన్నీ కుదిరిన సినిమా 'భజేవాయువేగం' అని చెబుతూ.. సహకరించిన అందరికీ దర్శకుడు ప్రశాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అతిథులుగా విచ్చేసిన మేర్లపాక గాంధీ, వశిష్ఠ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఇంకా చిత్రయూనిట్ సభ్యులంతా మాట్లాడారు.



# హాయిహాయిగా.. నయనతార వెకేషన్

తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కన్నడ భామ నయన తార. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది. ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో బిజీబిజీగా ఉండే నయనతార ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉంది. ఈ బ్యూటీ తన ఫ్యామిలీతో కలిసి టూర్ వేసింది. ఇంతకీ ఈ భామ ఎక్కడికెళ్లిందనే కదా మీ డౌటు. పాపులర్ సిటీ హాంకాంగ్‌కు వెళ్లింది. అక్కడ ఓ రిసార్ట్స్‌లో తన పిల్లలతో కలిసి సేద తీరింది. హాంకాంగ్ వెకేషన్‌లో నయన్‌విఘ్నేశ్ శివన్ చక్కర్లకు సంబంధించిన స్టిల్స్ కొన్ని నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. వాటిపై మీరూ ఓ లుక్కేయండి మరి. నయనతార నటిస్తోన్న తమిళ చిత్రాల్లో ఒకటి Mannangatti Since 1960. ఈ మూవీ షూటింగ్ పూర్తి చేసుకోగా.. షూటింగ్ లొకేషన్‌లో సెలబ్రేషన్‌కు సంబంధించిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. డ్యూడ్ విక్కీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై లక్ష్మణ్ కుమార్ తెరకెక్కిస్తుండగా.. యోగిబాబు, దేవదర్శిని, గౌరీ కిషన్, నరేంద్ర ప్రశాంత్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నయనతార మరోవైపు తనీ ఒరువన్ 2, టెస్ట్, డియర్ స్టూడెంట్స్, కన్నప్ప చిత్రాల్లో ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తోంది. నయన్ మరో సినిమా Test షూటింగ్ పూర్తి చేసుకుంది.

# ఓటీటీలోకి ఆ ఒక్కటీ అడక్కు..!

కామిక్ టైమింగ్ ఉన్న టాలెంటెడ్ యాక్టర్ అల్లరి నరేశ్ గత కొంతకాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నాడని తెలిసిందే. ఇటీవలే 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. మల్లి అంకం దర్శకత్వం వహించిన ఈ మూవీ మే 03న విడుదలైంది. ఈ మూవీలో జాతిరత్నాలు ఫేం ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించింది. ఫస్ట్ లుక్, గ్లింప్స్ వీడియో, టీజర్, ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చినా థియేటర్లలో మాత్రం ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. ఆ ఒక్కటి అడక్కు పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రీమియర్ అయింది. అయితే ముందుగా ప్రకటన జారీ చేసిన తర్వాత ఓటీటీలో రావాల్సి ఉండగా.. అమెజాన్ ప్రైమ్ వీడియో మాత్రం సైలెంట్‌గా సినిమాను ప్రీమియర్ చేయడం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. మరి ఆ ఒక్కటి అడక్కు చిత్రానికి ఓటీటీ ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి. ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక తెరకెక్కించారు. ఈ మూవీలో వెన్నెల కిషోర్, జామీ లివర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. అల్లరి నరేశ్ ఇటీవలే బచ్చలమల్లి సినిమా అప్‌డేట్ అందించిన విషయం తెలిసిందే. 1990 కాలంనాటి భావోద్వేగ ప్రయాణం నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాకు సుబ్బు మంగదేవి దర్శకుడు.





# యాక్షన్ సీక్వెన్స్‌తో హరోంహర

'ఇండియన్ స్క్రీన్ మీద 'హరోం హర' లాంటి సినిమా ఇప్పటివరకూ రాలేదు. ఇందులో నా పేరు సుబ్రహ్మణ్యం. వృత్తి గన్ స్మిత్. కేరక్టర్ ఎదిగేకొద్దీ రకరకాల గన్స్, ల్యాండ్‌మైన్స్, రాకెట్ లాంచర్స్.. ఇలా చాలా తయారు చేస్తాడు. సింగిల్ లైన్లో చెప్పాలంటే జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం. మన పక్కింటి కుర్రాడికి గన్ తయారు చేసే నాలెడ్జ్ వుంటే తను ఎలా తయారు చేస్తాడనే తరహాలో ఆసక్తికరంగా సాగుతుందీ సినిమా. ఈ గన్స్ విషయంలో దర్శకుడు చాలా రీసెర్చ్ చేశారు. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్ టాప్ క్లాస్‌లో వుంటాయి. ఈ సినిమాకోసం ఓ ప్రత్యేకమైన ప్రపంచాన్నే సృష్టించాడు దర్శకుడు జ్ఞానసాగర్.' అన్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'హరోంహర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. సుమంత్ జి.నాయుడు నిర్మాత. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్‌నంది, నిర్మాతలు కె.ఎల్.దామోదరప్రసాద్, బెక్కెం వేణుగోపాల్ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇంకా కథానాయిక మాళవిక శర్మతో పాటు చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.



# కాంతార చాప్టర్ 1లో మాలీవుడ్ యాక్టర్..

కన్నడ ఇండస్ట్రీ నుంచి విడుదలై.. టాలీవుడ్, కోలీవుడ్‌తోపాటు గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది 'కాంతార'. టాలెంటెడ్ కన్నడ యాక్టర్ కమ్ డైరెక్టర్ రిషబ్‌శెట్టి దర్శకత్వంలో మరోసారి కాంతార ప్రీక్వెల్‌గా వస్తుందని తెలిసిందే. కాంతార చాప్టర్ 1 టైటిల్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే లాంఛ్ చేసిన కాంతార చాప్టర్ 1 ఫస్ట్ లుక్, టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. కాంతార చాప్టర్ 1 ఫస్ట్ లుక్ టీజర్ నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ సారి కూడా బాక్సాఫీస్‌పై దండయాత్ర చేయడం పక్కా అయిపోయినట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది. తొలిపార్టును రూ.16 కోట్లలోపే నిర్మించిన రిషబ్ శెట్టి.. ప్రీక్వెల్ కోసం రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. కాగా ప్రీక్వెల్‌లో ప్రముఖ నటుడు కీ రోల్ చేస్తున్నాడన్న వార్త ఒకటి వైరల్ అవుతోంది. కాంతార చాప్టర్ 1 పాపులర్ మలయాళం యాక్టర్ జయరాం కీలక పాత్రలో నటిస్తున్నట్టు మాలీవుడ్ సర్కిల్ టాక్ కాగా.. జయరాం ఇప్పటికే షూట్‌లో జాయిన్ అయ్యాడని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. మరి దీనిపై మేకర్స్ ఏదైనా అధికారిక ప్రకటన జారీ చేస్తారా..? అనేది చూడాలి. జయరామ్ ఇప్పటికే భాగమతి, అల వైకుంఠపురంలో, గుంటూరు కారం సినిమాలతో తెలుగులో సూపర్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. తాజా అప్‌డేట్ నిజమే అయితే మరి ప్రీక్వెల్‌తో జయరామ్ స్టేటస్ పాన్ ఇండియా రేంజ్‌లో మార్మోగిపోవడం ఖాయమైనట్టేనంటున్నారు సినీ జనాలు. ప్రీక్వెల్‌ను కూడా హొంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ నిర్మిస్తుండగా.. మరోసారి అజనీష్ లోకనాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీని కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com